

సముచిత స్థానం కల్పించండి

కోల్‌సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తనకు సముచిత స్థానం కల్పించాలని రామగుండం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్ మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌లను కోరారు. హైదరాబాద్‌లో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. మూడుసార్లు రామగుండం నగరపాలక సంస్థ కార్పొరేటర్‌గా పని చేశానన్నారు. కాంగ్రెస్ పెద్దల ఆశీస్సులతో ప్రజా సేవా కార్యక్రమాల్లో ఉన్నానన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా పార్టీ కోసం, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిషలు పని చేస్తున్నానన్నారు. తనకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.



ధర్మారంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయుల నిరసన

8



ఓదెలలో రోడ్డు కొలతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

నాలుగు నెలల్లో రోడ్డు విస్తరణ పనులు పూర్తి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

8

న్యూస్ బాక్స్

నిందితుడిని శిక్షించాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కత్తా జూనియర్ డాక్టర్‌ని అత్యాచారం చేసి హత్య చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు జ్యోతి డిమాండ్ చేశారు. మంగళవారం కాలనీలో పీఓడబ్ల్యు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా జ్యోతి మాట్లాడారు. కోల్‌కత్తా లాంటి నగరంలోనే వైద్య విద్యార్థినికి రక్షణ లేకపోవడం ప్రభుత్వాలు సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. అశ్లీల సాహిత్యం, బూతు సినిమాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉన్నదని, మహిళలపై అఘాయిత్యాల కేసుల్లో శిక్షలను కఠినతరం చేసేలా కేంద్రం చట్టాలు తేవాల్సిన అవసరం ఉన్నట్టు పేర్కొన్నారు. మహిళ ముఖ్యమంత్రిగా ఉన్న మమతా బెనర్జీ ఈవిషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉన్నట్టు జ్యోతి అభిప్రాయపడ్డారు. ఈనిరసనలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, పీఓడబ్ల్యు నాయకురాళ్లు మేరీ, శారద, లక్ష్మీ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ముత్తారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండల నూతన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా కీర్తన బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ సురేష్ జాయినింగ్ రిపోర్టును అందజేశారు.

ఉప వర్గీకరణ చేపట్టాలి

మంథని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీ ఈలుగా ఉపవర్గీకరణ చేయాలని ప్రభుత్వ కోరుతూ తహసీల్దార్‌కు బీసీ సంఘం సీనియర్ నేత గోటికార్ కిషన్‌జీ, బీసీ ఫెడరేషన్ కులాల సమితి నియోజకవర్గ కన్వీనర్ కావేటి సమ్మయ్య మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం సమగ్ర బీసీ కుల గణన చేపడుతున్న తరుణంలో ఏబీసీడీఈ వర్గీకరణపై దృష్టి సారించాలని కోరారు.



కుందనపల్లి యాష్ పాండ్‌లో లారీలోకి లోడింగ్ చేస్తున్న బూడిద

'బూడిద'పై అదనపు బాదుడు

- ప్రతి లోడ్‌కు రూ.500 వసూలు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది
- వసూలవుతున్న డబ్బులు అంతర్గాం తహసీల్దార్ ఖాతాలోకే..
- ఇదంతా కలెక్టర్ కార్యాలయం పర్యవేక్షణలోనే అంటున్న తహసీల్దార్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని కుందనపల్లిలోగల ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి తరలుతున్న బూడిదపై అదనపు బాదుడు మొదలెట్టారు. యాష్ పాండ్ వద్ద రెవెన్యూ అధికారులు టోల్ గేట్ ఏర్పాటు చేసి ఒక్కో లారీ లోడ్‌కు 500 రూపాయలు వసూలు చేస్తున్నారు. మున్నెన్నడూ లేని విధంగా ఈనెల 1వ తేదీ నుంచి డబ్బులు వసూలు చేస్తుండడంతో లారీల యజమానులు అవాక్కవుతున్నారు. ఈ డబ్బులు ఏ ప్రాతిపదికన వసూలు చేస్తున్నారు? ఎందుకు వసూలు చేస్తున్నారు? ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వసూలు చేస్తున్నారా? అంటే సంబంధిత అధికారుల నుంచి సరైన సమాధానాలు రావడం లేదు. ఈ వసూళ్ల వ్యవహారం విమర్శలకు దారి తీస్తున్నది. రామగుండంలో ఎన్టీపీసీలో చేపడుతున్న విద్యుత్ ఉత్పత్తి వల్ల వెలువడే బూడిద కోసం కుందనపల్లి వద్ద యాష్ పాండ్ నిర్మించిన విషయం తెలిసిందే. గతంలో ఇందులోని బూడిదను ఎవరైనా తరలించుకు పోతామంటే ఉచితంగానే ఇచ్చేవాళ్లు. 2021 నుంచి టెండర్లు విధించి బూడిదను విక్రయించారు. ప్రస్తుతం ఎక్కడైతే జాతీయ రహదారులను నిర్మిస్తారో, వాటి కోసం బూడిదను ఉచితంగా అందజేస్తున్నారు. సింగరేణికి ఉచితంగానే అందజేస్తున్నారు. ఇటుక బట్టీలు, ఇతరత్రా అవసరాలకు తీసుకవెళ్లే బూడిదకు టన్నుకు 300 రూపాయలతో పాటు 5 శాతం జీఎస్టీ చెల్లిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణానికి గత 10 మాసాల నుంచి బూడిద తరలుతున్నది. అకస్మాత్తుగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈనెల 1వ తేదీ నుంచి యాష్ పాండ్ నుంచి బూడిద లారీలు బయటకు వెళ్లే మొఘల్ ఫహాడ్ వద్ద ఒక డబ్బాను ఏర్పాటు చేసి జాతీయ రహదారుల కోసం, ప్రైవేట్ అవసరాల కోసం బూడిదను తీసుకవెళుతున్న లారీల యజమానుల నుంచి అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే సిబ్బంది ట్రిప్పునకు 500 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. అలాగే ముందస్తుగా చెక్కులు కూడా తీసుకుంటున్నారు. రామగుండం ఎస్‌బీఐ శాఖలో 'తహసీల్దార్ అంతర్గాం' పేరిట గల ఖాతా నంబర్ 62492086441కు ఒక లారీ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ 2 లక్షల రూపాయలు జమ చేయడం గమనార్హం. టోల్ గేట్ వద్ద నగదు రూపేణా గాకుండా అంతర్గాం తహసీల్దార్ పేరిట ఉండే ఖాతాకు ఫోన్ పే ద్వారా తీసుకుంటున్నారు. కానీ ఎలాంటి రిసిప్టులు ఇవ్వడం లేదు. ఎవరన్నా టోల్ వద్ద ఆగకుండా వెళ్లే వాహనాల నంబర్లను నమోదు చేసుకుని పెద్దపల్లి ఆర్‌టీవో కార్యాలయం అధికారులకు సమాచారం ఇస్తున్నారని తెలుస్తున్నది.

● గోప్యత పాటిస్తున్న అధికారులు..

కుందనపల్లిలోగల ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి జాతీయ రహదారుల కోసం రోజుకు 150 నుంచి 200కు పైగా లారీలు వెళుతున్నాయి. ప్రైవేట్ అవసరాలకు ప్రస్తుతం 20 లారీల లోపే వెళుతున్నాయి. ప్రస్తుతం రోజుకు అదనపు బాదుడు రోజుకు 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఆదాయం సమకూరుతున్నది. వచ్చే నెలలో ఇటుక బట్టీల్లో ఇటుకల తయారీ ప్రారంభం కానుండడంతో బట్టీలకు పెద్దఎత్తున బూడిదను తరలించనున్నారు. మొత్తం రోజుకు 400 నుంచి 500కు పైగా ట్రిప్పుల లారీల బూడిద తరలే అవకాశం ఉంది. దీంతో మరింత ఆదాయ పెరగనున్నది. 5 శాతం జీఎస్టీతో కలుపుకుని టన్నుకు9 315 రూపాయలు ఎన్టీపీసీకి చెల్లిస్తున్నామని, అదనంగా 500 రూపాయల బాదుడు తమపై తీరని భారం పడుతున్నదని ఇటుక బట్టీల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సింగరేణిలో తీసే బొగ్గుపై ఆ సంస్థ ప్రభుత్వానికి

(మిగతా 8వ పేజీలో..)



కుందనపల్లి యాష్ పాండ్ వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్

4నుంచి టాస్క్ కేంద్రంలో మొదటి బ్యాచ్ : కలెక్టర్

పెద్దపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్ కేంద్రంలో మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు నవంబర్ 4 నుంచి ప్రారంభమవుతాయని, ఆసక్తిగల యువతీయువకులు తమ పేర్లను ఈనెల30లోపు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాస్క్ అనేది పరిశ్రమకు నాణ్యమైన మానవ వనరులు, సేవలను అందించే లక్ష్యంతో పరిశ్రమల మధ్య సమన్వయాన్ని తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన లాభాపేక్ష లేని సంస్థ అని, టాస్క్ పేర్కొన్నారు. పెద్దపల్లి రీజినల్ సెంటర్‌లో నవంబర్ 4 నుంచి మొదటి బ్యాచ్ 2022 నుంచి 2024 వరకు డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం పేరు నమోదు చేసుకోవాలన్నారు. టాస్క్ ద్వారా కనీసం 10రోజులపాటు సాఫ్ట్‌స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ ఐటీస్కిల్స్‌పై శిక్షణ అందించనున్నారని తెలిపారు. ఆసక్తిగల వారు పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోగల టాస్క్ కార్యాలయానికి వెళ్లి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9533308928 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వర్షాలతో వరి కోతలను వాయిదా వేయండి

పెద్దపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు, నాలుగు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసి, 4 రోజుల తర్వాత వరి కోతలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి ఒక ప్రకటనలో రైతులను కోరారు. ఇది వరకే వరి కోసిన రైతులు పొలం వద్దనే తమ ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పుకొని తడవకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో మూడు, నాలుగు రోజుల తర్వాత పొడి వాతావరణం ఉంటుందన్నారు. ప్రస్తుతం వరి కోయడం వల్ల 17 శాతం తేమ రాదని, ఆరబెట్టడానికి చాలా రోజులు పడుతుందని పేర్కొన్నారు. వాతావరణాన్ని గమనించే వరి కోతలు చేపట్టాలని ఆయన సూచించారు.

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో అందించే పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో పూర్వప్రాథమిక విద్యపై అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ ప్రతినిధులు, రాష్ట్రస్థాయి బృంద సభ్యులు, సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్యను అంగన్వాడీ కేంద్రాలలో బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను అజీమ్ ప్రేమ్ జీ సంస్థ సభ్యులు శ్రీనివాసరావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జూన్ నుంచి అక్టోబర్ వరకు సంగారెడ్డి జిల్లాలో అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య పకడ్బందీగా అమలు చేయడం జరిగిందని, ప్రస్తుతం అదేస్థాయిలో జిల్లాలోనూ అమలు చేసేందుకు సహకారం అందించడానికి ముందుకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య సిలబస్ బోధించేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన బోధన పద్ధతులు, తదితర అంశాలపై అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ ఆధ్వర్యంలో 28 సూపర్ వైజర్లకు, 28 యాక్టివ్ టీచర్లకు వచ్చేనెల ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. ఈ శిక్షణ వినియోగించుకొని సూపర్వైజర్లు, యాక్టివ్ టీచర్లు ప్రతినెల నిర్వహించే సమావేశాలలో బోధన పద్ధతులు, పూర్వ ప్రాథమిక విద్య అమలుకు చర్యలపై ఇతర అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తారని అన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల హాజరు శాతం పెంచుతూ వారికి మంచి పూర్వ ప్రాథమిక విద్య అందేవిధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధులు రాహుల్, అజీమ్ ప్రేమ్ జీ సంస్థ సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్‌రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కాంటాలు ఏర్పాటు చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలంలో రైతులు సాగు చేసిన సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రాల్లో వేర్వేరుగా కాంటాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సంబంధించి జిల్లాలో పటిష్ఠ కార్యాచరణతో 300కు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గోనె సంచులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచి పోకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులలో ప్రచారం కల్పించాలని, అదే విధంగా సన్న రకం ధాన్యం గుర్తింపు పక్కాగా జరిగేలా చూడాలని అన్నారు. బస్తాలలో నింపిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడ్ క్లీనర్లు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు, అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తాలు, తరుగు విషయమై రైతులను ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డీసీవో శ్రీమాల, డీఆర్‌డీవో రవీందర్, పౌరసరఫరాల డీఎం శ్రీకాంత్, డీఏవో ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి జాతీయ రహదారి పనులు ప్రారంభం

పెద్దపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల- వరంగల్ వరకు నిర్మించిన నాలుగు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులు పెద్దపల్లి జిల్లాలో నవంబర్ 15 నుంచి ప్రారంభమవుతాయని, భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం జాతీయ రహదారి 136జి నిర్మాణం పెండింగ్ భూసేకరణ ప్రక్రియపై సంబంధిత జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల-వరంగల్-ఖమ్మం జిల్లాలను కలిపే నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే పెండింగ్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తిచేయాలని అన్నారు. సేకరించిన భూమిని జాతీయ రహదారుల అథారిటీ అప్పగించాలని కలెక్టర్లకు సూచించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో రైతుల ఆర్బిట్రేషన్ ప్రక్రియ ద్వారా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు పూర్తిచేసిన భూములను జాతీయ రహదారుల అథారిటీకు అప్పగించామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కమాన్‌పూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికల్‌పేటకు చెందిన ఏగోలపు నర్సయ్యగౌడ్ అనే గీత కార్మికుడు మంగళవారం ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. నర్సయ్యగౌడ్ తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారటంతో కిందపడ్డాడు. గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు : ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ ఉపేందర్

సుల్తానాబాద్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని రామగుండం కమిషనరేట్ పరిధిలోని నార్కోటిక్ బ్యూరో ఏసీపీ ఉపేందర్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ కార్యక్రమంలో హాజరైన విద్యార్థులు, యువతను ఉద్దేశించి ఏసీపీ మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాల వాడకం గురించి ఎవరికి తెలిసినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 14446కు ఫోన్ చేసి తెలుపాలన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపుతూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని పలురుకి ఆదర్శంగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి విద్యా సంస్థల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్,డాక్టర్ సింధూజ, బండారి కమలాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

- ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికి ట్రాఫిక్ రూల్స్‌పై అగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దబొంకూరు మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మద్యం సేవించి వాహనాలు నడిపితే కలిగే నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రామగుండంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

- వీధి కుక్కలకు సంతాన వృద్ధి చెందకుండా ఆపరేషన్లు : కలెక్టర్

కోల్‌సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో యానిమల్‌బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) పునరుద్ధరించినట్టు కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలు, యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ 2023 ప్రకారం నగరపాలక సంస్థ పరిధిలోని మల్కాపూర్‌వద్ద యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించామని, హైదరాబాద్‌కు చెందిన యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కుక్కల సంతాన వృద్ధి చెందకుండా ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. ఈ కేంద్రంలో ఒక ఆపరేషన్ థియేటర్, 50కుక్కలను ఉంచడానికి అవసరమైన బోన్లను ఏర్పాటు చేశామన్నారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పచ్చదనం - స్వచ్ఛదనం కార్యక్రమం క్రింద గుర్తించిన కుక్కలను వాటి సంతాన వృద్ధి చెందకుండా ఏరియాల వారిగా పట్టుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి వారం రోజులపాటు ఏబీసీ సెంటర్‌లోనే ఉంచుతారన్నారు. తరువాత కుక్కలను పట్టిన ప్రాంతాల్లో విడిచిపెడుతారని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో గుర్తించిన సుమారు 4వేల వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు పూర్తయ్యే వరకు సుమారు నాలుగు నెలల పాటు ఈ ఏబీసీ సెంటర్‌ను నిర్వహిస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని వీధి కుక్కలే కాకుండా పరిసర ప్రాంతాల నుంచి కూడా వీధి కుక్కలను తీసుకువచ్చి ఆపరేషన్ చేసి పంపుతారని కలెక్టర్ పేర్కొన్నారు.

పుష్‌పుల్ రైలు కింద పడి యువకుడి మృతి

- వరంగల్‌లో ఘటన - మృతుడు పెద్దపల్లి జిల్లా వాసి

గిర్మాజిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : హోంకేర్ సర్వీసు అందించడానికి వరంగల్‌కు వచ్చి తిరిగి వెళ్లేందుకు పుష్‌పుల్ రైలు ఎక్కబోతూ పట్టుతప్పి ప్రమాదవశాత్తు రైలు కిందపడి కల్వల సంజీవ్ (33) దుర్మరణం చెందాడు. ఈ విషాద సంఘటన సోమవారం అర్ధరాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. మంగళవారం రాత్రి వరంగల్ జీఆర్‌పీ సీఐ సురేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా అదే మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన కల్వల సంజీవ్ ప్రేమ వివాహం చేసుకుని భార్య డైజి, సంవత్సరం వయస్సు కలిగిన కుమారుడితో కలిసి గ్రామంలో నివసిస్తున్నాడు. హోంకేర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఫోన్‌లో సమాచారం రాగానే వెళ్లి హోంకేర్ పనులు చేసి ఇంటికి చేరుకునేవాడు. రెండు రోజుల క్రితం వరంగల్‌కు వచ్చిన సంజీవ్ సోమవారం హనుమకొండలోని అమ్మ హోంకేర్ సర్వీసుకు వెళ్లగా పనిలేదని చెప్పడంతో పెద్దపల్లికి వెళ్లేందుకు రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత డోర్నకల్ నుంచి కాజీపేట వెళ్తున్న పుష్‌పుల్ రైలు 3 నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు వచ్చింది. సంజీవ్ కదులుతున్న రైలు ఎక్కబోయి పట్టుతప్పి ప్లాట్‌ఫామ్ రైలుకు మధ్య ఇరుక్కుని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు.

మృతుడి వద్ద లభించిన బ్యాగులోని ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని అదే అర్ధరాత్రి ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సంజీవ్ బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఆయిల్‌పామ్ తోటలు మెట్ట రైతుకు వరంగా మారనున్నాయి. తక్కువ పెట్టుబడితో, తక్కువ నీటితో ఈ పంట సాగు చేయవచ్చు. మరోవైపు అంతరపంటగా ఇతర పంటలు సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చు. చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ నర్సరీ నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మొక్కలు సరఫరా చేస్తున్నారు.



చిగురుమామిడి నర్సరీలో పెరుగుతున్న ఆయిల్ పామ్ మొక్కలు

మెట్ట రైతుకు వరం.. ఆయిల్‌పామ్ తోటలు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి
- అంతర పంటలతో అదనపు ఆదాయం
- చిగురుమామిడి నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కలు

చిగురుమామిడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పంట వేయాలన్నా కోతుల బెడద తీవ్రంగా ఉన్నది. దీంతో రైతులు వరి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు కొరత ఏర్పడినపుడు వరి పంట ఎండిపోయి తీవ్రంగా నష్టం జరుగుతోంది. ముఖ్యంగా యాసంగి సాగులో రైతులు సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు ఎండిపోయి పెట్టుబడి నష్టపోతున్నారు. మెట్ట రైతులకు అనుకూలంగా ఉండేందుకు ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. కొందరు రైతు పంట సాగుకు ముందుకు వస్తున్నారు.

ఎకరంలో 57 మొక్కలు

ఎకరానికి 57 మొక్కలు నాటవచ్చు. ఎకరం వరి పంటకు కావాల్సిన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ తోట సాగుచేయవచ్చు. తక్కువ కూలీల ఖర్చు ఉంటుంది. ఆయిల్ పామ్ సాగుచేస్తున్న తోటలో అంతర పంటలు వేసుకుంటున్న రైతులకు ఎరువులకు, ఇతర ఖర్చులకు సంవత్సరానికి 4,200 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఎకరంలో 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెపుతున్నారు. గతంలో టన్ను ధర 14,000 రూపాయలు ఉండేది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అయిల్ పామ్ తోటలకు ప్రోత్సాహం ఇస్తూ టన్ను ధర 17,000 రూపాయలకు పెంచింది.

సబ్సిడీపై డ్రిప్ పంపిణీ

గత ప్రభుత్వంలో పామాయిల్ సాగుకు సబ్సిడీపై డ్రిప్ ఇవ్వలేదు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు వందశాతం సబ్సిడీతో డ్రిప్ అందిస్తున్నారు. బీసీ ఇతర సామాజిక వర్గాలకు 90శాతం సబ్సిడీపై డ్రిప్ ఇస్తున్నారు. ప్రతి రైతు 20 రూపాయాలతో ఒక మొక్క పొందవచ్చు. మొక్కధర 200 రూపాయలు ఉండగా ప్రభుత్వం 180 రూపాయల సబ్సిడీ అందిస్తోంది. ఆయిల్‌పామ్ మొక్కలు పెంచాలనుకునే రైతులు ధ్రువపత్రాలతో వ్యవసాయశాఖ అందికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

తక్కువ పెట్టుబడితో ఆయిల్ పామ్ తోటలు పెంచవచ్చు

- గొర్ల పరమేశ్వర్, రైతు, బొమ్మనపల్లి

అన్ని పంటలకన్నా అయిల్ పామ్ తోటలు తక్కువ పెట్టుబడితో పెంచవచ్చు. సాగునీటి కొరత ఉన్న ప్రాంతంలో ఈ మొక్కలు పెంచితే లాభదాయకం. అధికారులు రైతులకు మరింత అవగాహన కల్పించి అయిల్ పామ్ తోటలు పెంచేలా ప్రోత్సహించాలి.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

-జనవేని రాజమల్లు, రైతు, ఉల్లంపల్లి

సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉంటే అన్ని పంటల కన్నా ఆయిల్ పామ్ సాగు చాలా సులభం. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడి ఉంటుంది. కోతుల బెడద ఉండదు. పంటలకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. అంతర పంటగా అన్ని రకాల పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చు. పంట సాగుకు రైతులు ముందుకు వస్తే మార్కెటింగ్ సౌకర్యం ఉంటుంది.

చిగురుమామిడిలో రైతకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ మ్యాదరబోయిన ప్రవీణ్



అక్రమ కట్టడాల కూల్చివేత

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లో ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది కూల్చి వేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 669 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాల మేరు మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు ఆర్ఐ కనకరాజు, కార్యదర్శి లచ్చయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు.

రూ. 6,800 పలికిన పత్తి ధర


జమ్మికుంట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 196 మంది రైతులు 1,630క్వింటాళ్ల విడి పత్తి, 15 మంది రైతులు 26 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు

తిమ్మాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై ఆర్టీసి బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన జింక మల్లేశం కరీంనగర్ వైపునకు తన ద్విచక్ర వాహనంపై వెలుతుండగా ఇందిరా నగర్ వద్ద వెనుక నుంచి ఆర్టీసి బస్సు ఢీ కొట్టి వెళ్లిపోయింది. ద్విచక్ర వాహనం పైనుంచి మల్లేశం కిందపడటంతో గాయాలు కాగా స్థానికులు గమనించి కరీంనగర్ అనుపత్రికి తరలించారు.

తాళం పగులగొట్టి చోరీ

జమ్మికుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాకాలనికి చెందిన బోగం లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. లక్ష్మి ఈ నెల 18న ఇంటికి తాళం వేసి బందువుల ఇంటికి వెళ్లింది. ఇంటి సమీపంలో ఉన్న కుమార్తెకు ఫోన్ చేసి ఇంటి వైపు చూడమని చెప్పింది. మంగళవారం ఉదయం ఇంటి తాళం తీసి ఉండటాన్ని గమనించిన కుమార్తె తల్లికి సమాచారం అందించింది. హుటాహుటిన వచ్చిన తల్లి ఇంట్లోకి వెళ్లి చూడగా, నగదు, వెండి, బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్లు గమనించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రవికుమార్ తెలిపారు.



ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కారుతో ఢీ కొట్టి.. కత్తితో పొడిచి..

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడి దారుణ హత్య - కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ధర్నా,

- హత్యకు రాజకీయ కక్షలే కారణమంటూ ఆరోపణ



మారు గంగారెడ్డి(ఫైల్)

జగిత్యాల క్రైం/జగిత్యాల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి(58) మంగళవారం దారుణ హత్యకు గురయ్యాడు. కారుతో ఢీ కొట్టి.. కత్తితో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలోని జగిత్యాలరూరల్ మండలం జాబితాపూర్‌లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. జాబితాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ, జీవన్‌రెడ్డికి రాజకీయంగా అనుచరుడిగా పేరున్న మారు గంగారెడ్డి మంగళవారం ఉదయం గ్రామ కూడలిలో దారుణ హత్యకు గురయ్యాడు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న గంగారెడ్డిని అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్‌గౌడ్ అనే యువకుడు కారుతో వెనుకనుంచి ఢీ కొట్టాడు. అదుపు తప్పి కింద పడిన గంగారెడ్డిని అందరూ చూస్తుండడానే కత్తితో చాతితో పాటు కడుపులో విచక్షణా రహితంగా పొడిచాడు. అనంతరం వేరే కారులో తన అనుచరులతో కలిసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన గంగారెడ్డిని కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జీవన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని గంగారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు.

మూడు గంటలకు పైగా ఆందోళన...

గంగారెడ్డి హత్య విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. హత్యకు ఇటీవల చేరిన కాంగ్రెస్ నాయకుడే కారణం అంటూ ఆరోపించారు. జగిత్యాల-ధర్మపురి ప్రధాన రహదారి ఇందిరా చౌక్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బైఠాయించి ఆందోళన చేపట్టారు. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సైతం ధర్నాలో పాల్గొని పోలీసుల తీరుపై మండిపడ్డారు. దీంతో ఎస్పీ అశోక్‌కుమార్ రంగప్రవేశం చేసి విప్‌తో పాటు ఎమ్మెల్సీతో గంటకు పైగా మంతనాలు జరిపారు. హత్యకు పాల్పడ్డ నిందితుడిని పట్టుకుని శిక్షిస్తామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దసరా పండుగ నుంచే స్కెచ్..

గంగారెడ్డిని హత్య చేసేందుకు అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్ దసరా పండుగ నుంచే స్కెచ్ వేసినట్లు గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనలు చెబుతున్నాయి. గంగారెడ్డి గ్రామంలో ఏ సమస్య ఉన్నా పెద్ద మనిషిగా వ్యవహరించేవాడు. సంతోష్‌గౌడ్‌కు తన కుటుంబసభ్యులకు భూసమస్యలు ఉన్నాయి. ఈవిషయంలో గంగారెడ్డి పెద్ద మనిషిగా తనకు వ్యతిరేకంగా ఉన్నాడని కక్ష పెంచుకున్నట్టు తెలిసింది. అంతేకాకుండా ఇటీవల బతుకమ్మ, దసరా పండుగల వేడుకల్లో సైతం సంతోష్‌గౌడ్‌కు గంగారెడ్డికి మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. ఇదే కారణంతో రాజకీయంగా గంగారెడ్డి ఉనికి లేకుండా చేసేందుకు కొంతమంది స్కెచ్ వేసి సంతోష్ గౌడ్‌తో హత్య చేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీఎంవో, సీఎస్ దృష్టికి తీసుకెళ్లిన అడ్లూరి...

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి హత్యకు గురైన సంఘటను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లారు. సీఎం కార్యదర్శితో పాటు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి కాంగ్రెస్ నాయకుడి హత్య గురించి వివరించారు. హత్య ఉదంతంపై పోలీసుల తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుడికి ప్రాణభయం ఉందనే విషయాన్ని పోలీసుల దృష్టికి ముందుగానే తీసుకెళ్లినా రక్షణ కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీపార్టీకి.. మీకూ ఓ దండం..

కాంగ్రెస్ నాయకుడి హత్య విషయాన్ని తెలుసుకున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పీసీసీ చీఫ్‌పై అసహనం వ్యక్తం చేశాడు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితానికి కాంగ్రెస్ పార్టీ మంచి బహుమతి ఇచ్చిందన్నారు. 'మీ పార్టీకి.. మీకు ఓ దండం అంటూ.. మీ పార్టీలో నేను ఇక ఉండను.. ఇకనైనా బతకనివ్వండి' అంటూ ఫోన్ కట్ చేశారు.

హత్యను ఖండించిన ఎమ్మెల్యే సంజయ్ ..

కాంగ్రెస్ నాయకుడి హత్యపై హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించారు. హత్యను తీవ్రంగా ఖండించారు. హత్యకు పూర్తి కారణాలు తెలుసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్‌ను ఆదేశించారు. నిందితులను, హత్యలో ప్రమేయం ఉన్న ఏఒక్కరినీ వదలొద్దని ఆదేశించారు. హత్యను రాజకీయకోణంలో చూడడం బాధాకరంగా ఉందన్నారు.

వీఎస్ఎస్ చైర్మన్ నుంచి ...

జాబితాపూర్ గ్రామానికి చెందిన మారు గంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో మంచి కార్యకర్తగా గుర్తింపు తెలచ్చుకున్నాడు. 40 ఏళ్ల కాలంలో వన సంరక్షణ సమితి అధ్యక్షుడి నుంచి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీతో పాటు జీవన్‌రెడ్డి ప్రధాన అనుచ రుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇటీవల జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడి జాబితాలో గంగారెడ్డి పేరు కూడా ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

పోలీసుల అదుపులో నిందితుడు?

గంగారెడ్డిని హత్యచేసి పారిపోయిన నిందితుడు బత్తిని సంతోష్ గౌడ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సంతోష్‌గౌడ్‌కు ఈ హత్యకు ఒక్కడికే సంబంధం ఉందా..? హత్యకు పాల్పడిన అనంతరం సంతోష్ గౌడ్ మరో కారులో పారిపోయిన సమయంలో మరో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు అనుమానించడం వారికి సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. హత్య చేసిన అనంతరం నిందితుడు తన ఫోన్‌ను కొద్ది దూరంలో పడేసి వెళ్లడం.. హత్యకు కొద్దిరోజుల ముందు జగిత్యాలరూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న దృశ్యాలను రీల్ చేసి సోషల్ మీడియాలో పెట్టడం చూస్తుంటే ఈ హత్య పక్కా స్కెచ్ ప్రకారమే చేసినట్లు తెలుస్తోంది. హత్యకు పాల్పడ్డ నిందితుడు సంతోష్‌గౌడ్ పై రౌడీ షీట్ కేసుతో పాటు గంజాయి సేవిస్తూ జులాయిగా తిరిగే వ్యక్తిగా పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. హత్య సంచలనంగా మారగా పోలీసులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా భారీ బందోబస్తు నిర్వహించారు. జాబితాపూర్ గ్రామంతోపాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల, ఇందిరా చౌక్‌కు భారీగా పోలీసులు మోహరించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ఆధార్, పాన్ కార్డ్‌లో ఫొటో మార్ఫింగ్

- బ్యాంకులో రూ. 20 లక్షల రుణం
- సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడి ఆవేదన



ఫేక్ డాక్యుమెంట్స్ చూపుతున్న నారాయణ

బుగ్గారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధార్, పాన్‌కార్డులోని తన ఫొటోలను మార్ఫింగ్ చేసి కేటుగాళ్లు బ్యాంకులో రూ. 20లక్షల రుణం తీసుకున్నారని ఓ బాధితుడు రెండు రోజుల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. బుగ్గారం మండలం మద్దునూరు గ్రామానికి చెందిన రైతు ముంజాల నారాయణ జగిత్యాలలోని ఓ బ్యాంకులో పంట రుణం కోసం వెళ్లాడు. బ్యాంకు అధికారులు మీ పేరు మీద హైదరాబాద్‌లో ఏడు ప్రైవేటు బ్యాంకుల్లో సుమారు రూ. 20లక్షల రుణం ఉన్నట్లు చెప్పడంతో అవాక్కయ్యాడు. ఆయా బ్యాంకులకు వెళ్లి ఆరా తీయగా తన ఆధార్, పాన్ కార్డులోని ఫొటోలను మార్ఫింగ్ చేసి రుణం తీసుకున్నట్లు తేలింది. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను బాధితుడు కోరాడు. బాధితుడు నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం హైదరా బాదు నుంచి ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు నారాయణకు తరచుగా కాల్ చేసి క్రెడిట్ కార్డు బిల్లు రూ. 4 లక్షలు కట్టాలని ఒత్తిడి చేసేవారు. తాను ఎలాంటి లోన్ తీసుకోలేదని హెచ్చరించడంతో అప్పటి నుంచి కాల్స్ చేయడం మానేశారు. నాలుగు నెలల నుంచి మళ్లీ బ్యాంక్ నుంచి కాల్స్ రావడంతో ఇతరులకు సంబంధించిన ఫోన్లు తనకు వస్తున్నాయేమో అని నారాయణ అపోహ పడి అధికారులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిన సమయంలో నారాయణకు పంట రుణం మాఫీ కావడంతో జగిత్యాలలోని కెనరా బ్యాంకులో క్రాప్ లోన్ కోసం వెళ్లడంతో అసలు విషయం బయటపడింది. నారాయణ పేరుమీద అప్పటికే రూ. 20 లక్షల లోన్ ఉందని, వాటికి సంబంధించిన కిస్తీలు కడ్డటం లేదని బ్యాంకు అధికారులు తెలపడంతో నారాయణ అవాక్కయ్యాడు. వెంటనే జగిత్యాలలోని సైబర్ క్రైమ్ వారికి ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని దీనితో గత సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. స్పందించిన కలెక్టర్ సైబర్ క్రైమ్ వాళ్లకి రిఫర్ చేశారని బాధితుడు నారాయణ తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి మృతి

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వట్టివాగు వద్ద ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయలై చికిత్స పొందుతున్న కోరుట్ల పట్టణానికి చెందిన నీలం హిమశ్రీ(22) అనే యువతి సోమవారం రాత్రి మృతి చెందింది. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న నీలం ప్రవీణ్ తన కూతురు హిమశ్రీని బైకుపై ఎక్కించుకోని మెట్‌పల్లి వస్తున్నాడు. పట్టణ శివారులోని వట్టివాగు వద్ద బ్రిడ్జిపై మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హిమశ్రీ సోమవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు, లారీ డ్రైవర్లపై కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): అప్పులు, కుటుంబ కలహాలతో నేత కార్మికుడు మానేరు వాగులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన ఆడెపు తిరుపతి (40) తంగళ్లపల్లిలోని మానేరు వంతెన పైనుంచి వాగులోకి దూకే ప్రయత్నం చేస్తుండగా భార్య అడ్డుకుంది. ఘటనను అటువైపుగా వెళ్తున్న వాహనాదారు గమనించి తిరుపతిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిపై దాడికి దిగడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు తిరుపతికి నచ్చజెప్పి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పులు, కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించినట్లు తిరుపతి పోలీసులకు తెలిపాడు. కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఏఎస్సై చంద్రమౌళి తెలిపారు.

హెల్మెట్ ఉండదు... ట్రాఫిక్ రూల్స్ పాటించరు

- ప్రమాదాలబారిన ద్విచక్రవాహనదారులు
- రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే బాధితులు
- దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు



హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో తమ జీవితాలతో పాటు కుటుంబాలను అంధకారంలోకి నెడుతున్నారు. ముఖ్యంగా యువత వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలుకొని తెచ్చుకుంటున్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎక్కువ మంది జీవితాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో అధికశాతం ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారే అధికంగా ప్రమాదాలు బారిన పడుతుండటంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరుగుతోందని పోలీసులు చెపుతున్నారు.

మచ్చుకు కొన్ని...

- ఈ నెల 21న తుమ్మన్నపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ బ్రిడ్జీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మెన్ హెల్మెట్‌ను ధరించకపోవడం మూలంగా తలకు బలమైన గాయం కావడంతో అక్క డికక్కడే మృతి చెందాడు.
- హుజూరాబాద్ మండలం శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ స్టేజి వద్ద హుజూరాబాద్ పట్టణంలోని మర్బ్యాల్ షాపు యాజమాని, ఆర్ఎంపీ వైద్యుడు ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్న క్రమంలో యూటర్న్ వద్ద ఎదురుగా మరో వాహనం రావడంతో వాహనం అదుపు తప్పింది. సదరు వ్యక్తి హెల్మెట్ ధరించకపోవడంతో తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడు.
- హుజూరాబాద్ మండలం తుమ్మన్నపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ద్విచక్ర వాహనదారుల మృత్యువులకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది. ఎన్‌హెచ్ఐ-563 పనుల కోసం వచ్చిన ఉపాధి హామీ కూలీలిద్దరూ తమ సొంత ఊరికి వెళ్లి తిరిగి పనులు జరిగే చోటికి అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో వాహనం నడుపుతున్న వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- తుమ్మన్నపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు విధుల్లో పాల్గొనేందుకు హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై బయల్దేరగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొ ట్టడంతో తల భాగానికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబం రోడ్డున పడింది.




కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న ద్విచక్రవాహనదారులు (ఫైల్)

ప్రమాద బీమాపై అవగాహన కరువు

రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో చాలా మంది జీవితాలే అర్ధంతరంగా ముగుస్తున్నాయి. దీంతో వారి కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కుటుంబ పోషకుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబ సభ్యుల పరిస్థితి అగమ్యగోచారంగా మారుతుంది. వాహనలు నడిపే ప్రతి వ్యక్తి బాధ్యతగా ప్రమాద బీమా తీసుకుంటే ప్రమాదవశాత్తు మరణించినా.. అంగవైకల్యం వచ్చినా బీమా ఆదుకునే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రవేశపెట్టిన బీమా పథకాలపై అవగాహన లేక వాటిని కోల్పోతున్నారు.

ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలి

- కంచె వేణు,ఎంవీఐ, హుజూరాబాద్



వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడం ద్వారా ప్రమాదాలు జరిగే అస్కారం చాలా తక్కువ. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు బయటికి తీస్తున్న క్రమంలోనే హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరిస్తే.. అనుకోని ప్రమాదం ఏర్పడితే హెల్మెట్ ద్వారా తలబాగాన్ని కాపాడుకోవచ్చు.

'శాతవాహన' సమాచారం

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలి

- ఎస్‌యూ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల చైతన్య



వీసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌యూ జేఏసీ నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, పీహెచ్‌డీ ప్రోగ్రాంను ప్రారంభించాలని, కొత్త కోర్సులకు అవకాశం కల్పించాలని ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్‌ను మంగళవారం శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల చైతన్య కోరారు. నూతనంగా శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతిగా నియమితులైన ప్రొఫెసర్ ఆచార్య ఉమేష్‌కుమార్‌ని శాతవాహన జేఏసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులుగా మార్చి నూతన కోర్సులను తీసుకువచ్చి పీహెచ్‌డీ ప్రోగ్రాంను ప్రారంభించాలన్నారు. అలాగే యూనివర్సిటీని పటిష్టం చేయాలని కోరారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరారు. దీనికి వీసీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌యూ జేఏసీ నాయకులు శనిగారపు అరుణ్ కుమార్, నైతం మహేష్, సత్యనారాయణ, రమేష్, తిరుపతి, అనిల్, శ్రీకర్, రవి పాల్గొన్నారు.

29 నుంచి బీఫార్మసీ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలో బీఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29వ తేదీ నుంచి, మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు 30నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు (సప్లిమెంటరీ) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ((రెగ్యులర్, సప్లిమెంటరీ) మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఎమ్మెస్సీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబరు 2024లో నిర్వహించిన ఎంఎస్సీ రెండో, నాలుగో సెమిస్టర్ గణితం (బ్యాక్‌లాగ్) పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఈ ఫలితాలు శాతవాహన వెబ్సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నేటి నుంచి ఎస్‌యూ అంతర డిగ్రీ కళాశాలల క్రీడా పోటీలు

● షెడ్యూల్‌ను ప్రకటించిన స్పోర్ట్స్ బోర్డు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్ అంతర డిగ్రీ, పీజీ కళాశాలల క్రీడా పోటీల షెడ్యూల్ బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ మేరకు శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ క్రీడా షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను శాతవాహన యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన శాతవాహన యూనివర్సిటీ జట్టు దక్షిణ భారత అంతర యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడాంశాల్లో పోటీలతోపాటు ఎంపికలను నిర్వహించనున్నారు. మిగతా క్రీడాంశాల్లో నేరుగా ఎంపికలను నిర్వహిస్తామని ప్రకటించారు.

● క్రీడల షెడ్యూల్ ఇలా..

ఈ నెల 23న శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలను పురుషుల విభాగంలో నిర్వహిస్తారు. 24న శాతవాహన యూనివర్సిటీ కళాశాల మైదానంలో మహిళలకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తారు. 25న కరీంనగర్ కార్ఖానగడ్డలోని డైనమిక్ జిమ్‌లో మహిళలకు, పురుషుల విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 26న కరీంనగర్ లారా జూడో అకాడమీలో మహిళలు, పురుషుల విభాగాల్లో జూడో క్రీడాంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. నవంబర్ 1న కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళలు, పురుషుల విభాగాల్లో ఆర్చరీ అంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 2న శాతవాహన యూనివర్సిటీ మైదానంలో మహిళల విభాగంలో వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. 4న కరీంనగర్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా మైదానంలో పురుషుల విభాగంలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తారు. 6న శాతవాహన యూనివర్సిటీ మైదానంలో పురుషుల విభాగంలో ఖో-ఖో పోటీలను, 7న మహిళల విభాగంలో ఖో-ఖో పోటీలను నిర్వహించనున్నారు. 13న శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో మహిళలు, పురుషుల విభాగంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 14న యూనివర్సిటీలో క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తారు.

చారిత్రక ఖిల్లా



పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు మనసుకు నూతనోత్తేజాన్ని అందించడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో గల చారిత్రక ఖిల్లా కూడా పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ఆలోచింపజేస్తోంది. జగిత్యాల పట్టణంలోని కోట, తెలంగాణ టూరిజం మ్యాప్‌లో మెరిసే నక్షత్రంగా ఖిల్లా గుర్తింపు పొందింది. వందల ఏళ్ల నాటి కట్టడం చెక్కు చెదరకుండా ఉండటం విశేషం. ఖిల్లా కారణంగానే జగిత్యాలకు ఆ పేరు వచ్చిందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

- టూరిజం మ్యాప్‌లో మెరిసే నక్షత్రం
- ఐరోపా కోటతో పోలికలు
- రాష్ట్రంలో ఉన్న ఏకైక నక్షత్రాకారం కోట
- శతృదుర్భేద్యంగా ప్రత్యేక గదులు, కందకాలు, బావి, సొరంగం
- పర్యాటక శాఖ ఆదరిస్తే మరింత గుర్తింపు

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో చారిత్రక కట్టడమైన జగిత్యాల ఖిల్లాను క్రీ.శ 1747లో ఎలగందుల కోటకు అధిపతిగా ఉన్న ముబారీ జాల్‌ముల్క్ జాఫరుదౌలా, మీర్జా ఇబ్రహీంఖాన్ 20 ఎకరాల విస్తీర్ణంలో ఖిల్లాను నిర్మించారు. 17వ శతాబ్దంలో ఇద్దరు యూరోపియన్ ఇంజనీర్లు జాక్, తాల్ ఈ ప్రాంతంలో నీటితో చుట్టుముట్టబడిన ఒక అందమైన నక్షత్ర ఆకారపు కోటను నిర్మించారు. ఈ ఇద్దరు ఇంజనీర్ల పేర్లు అయినా జాక్, తాల్ ప్రేరణ పొందిన ఈ ప్రదేశం తరువాత జగిత్యాల అని పిలిచేవారని స్థానికులు అంటున్నారు. ఈ కోట జాక్ తాల్ కోటగా ప్రసిద్ధి చెందింది. జగిత్యాల కోట రాయి సున్నంతో కట్టబడిన నక్షత్ర ఆకారపు డిజైన్‌లో ఉంటుంది. చుట్టూ లోతైన కందకం ఉండి ఆ కందకం ఇప్పటికీ నీటితో నిండి ఉంటుంది. 277 సంవత్సరాలు గడిచినా కోట చెక్కు చెదరలేదు. కోటలో నిర్మించిన కోనేరు ఎప్పటికీ నీటితో కలకల్లాడుతూనే ఉంటుంది. కోట లోపల మందుగుండు సామగ్రి నిల్వ చేసుకోవడానికి నిర్మించిన గదులున్నాయి. ఈ గదుల సమీపంలో వెనుక ద్వారం ఉందంటున్నారు.

● నక్షత్ర ఆకారపు కోట...

రాష్ట్రంలో నక్షత్ర ఆకారపు కోటగా జగిత్యాల ఖిల్లా గుర్తింపు పొందింది. మొఘల్ రాజవంశంలో గవర్నర్ నవాబ్ ఇబ్రహీం హయాంలో దీనిని నిర్మించారు. కోటకు రెండు చెక్క ద్వారాలు ఉన్నాయి. మొఘల్ సార్వభౌమాధికారంలో గవర్నర్ నవాబ్ ఇబ్రహీం పాలనలో నిర్మించబడిన ఈ కోట అత్యంత శక్తివంతమైన రాజవంశం ముద్రను కలిగి ఉంది. ఇది 264 మీటర్ల ఎత్తులో నిర్మించబడింది. దాని చుట్టూ



జగిత్యాల ఖిల్లా

మోతే చెరువు, ధర్మ సముద్రం చెరువు, ముపారపు, కండ్లపల్లి చెరువు అనే నాలుగు నీటి వనరులు ఉన్నాయి. కోట ప్రాంగణం అంతటా చెల్లాచెదురుగా ఉన్న భారీ ఫిరంగుల ఉనికి ద్వారా కోట అజేయంగా ఉన్న రోజులను ఇప్పటికీ గుర్తుచేస్తుంది. విదేశీ ప్రభావం కారణంగా ఈ కోట ఐరోపా కోటతో బలమైన పోలికను కలిగి ఉందన్న అభిప్రాయాలున్నాయి. జగిత్యాల ఖిల్లా ప్రత్యేక ఆకృతి, నిర్మాణం పలువురిని ఆకర్షింపజేస్తోంది. పాఠశాల, కళాశాల విద్యార్థులతో జిల్లాలో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసి పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఇటీవల ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మూడో బహుమతి దక్కింది. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, పర్యాటక శాఖ అధికారులు ఖిల్లా అభివృద్ధిపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.





నక్షత్ర ఆకారంలో నిర్మించిన కోట వ్యూ

మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్ధకం

- నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అతిథులు

గణేశ్‌నగర్,అక్టోబర్ 22:(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్ధకం అవుతుందని కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. మై భారత్- నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో మంగళవారం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్నటువంటి సమస్య అని అందులో మనదేశం కూడా ఉందన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన అంశమని యువత దీనికి అలవాటు పడితే భవిష్యత్తు పాడవుతుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు, డ్రగ్స్ వినియోగంలో యువత శాతం ఎక్కువగా ఉంటుందని అలాంటి వారితో దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ తీసుకునే వారి మానసిక స్థితి సరిగ్గా ఉండదని అలాంటప్పుడు వివిధ నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని అన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వాడితే తమ టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ నాగార్జున, శ్రీనివాస్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్, ఎం వెంకట్ రాంబాబు, డిస్టిక్ యూత్ ఆఫీసర్ నెహ్రూ యువ కేంద్రం, రాములు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎక్సైజ్ శాఖ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ సైకాలజిస్ట్ జక్కని రాజు మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత ఎదుర్కొంటున్న వివిధ మానసిక సమస్యలు, నివారణ గురించి వివరించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టు అంజనేయ స్వామి ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరాగా స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిం చారు.



ఆలయ ఆవరణలో భక్తులు

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు

గణేశ్‌నగర్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రాంనగర్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం అవుతున్నట్లు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు శిక్షణ కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి మీ పేర్లు నమోదు చేసుకోగలరని తెలిపారు. నైపుణ్య శిక్షణకు అర్హులు ఏడవ తరగతి ఆ పైబడిన తరగతి పాసైన, ఫెయిల్ అయిన 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని తెలియజేశారు. మూడు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇస్తామన్నారు. కోర్సు ఫీజు వివరాలు కంప్యూటర్ (ఎమ్మెస్ ఆఫీస్, డిటిపి)కి వెయ్యి రూపాయలు, బ్యూటీషియన్ కోర్సుకు 1500 రూపాయలు ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 9640967943, 9949850360 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హైబ్రిడ్ వంగడాలపై అవగాహన

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు హైబ్రీడ్ వరి వంగడాలు, వాటి ఉత్పాదకతపై వ్యవసాయ సంచాలకుల కార్యాలయం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కరీంనగర్ మండలం చామనపల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజు, వరి శాస్త్రవేత్త డాక్టర్ వీరన్నలు అవగాహన కల్పించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మహేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం, ఏఈవోలు సుచరిత, స్వర్ణలత, ఉదయ్, మైడితల్లి, డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వరి వంగడాలు, ఉత్పత్తులు, పత్తి సాగుపై అవగాహన కల్పించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కమాన్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న 39వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా కోచ్ రమేష్, రవీందర్ తదితరులు అభినందనలు తెలిపారు.



ఆనంది

గ్రామోద్యోగ్ వికాస్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

- కేవీఐసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్ లతాదేవి



మాట్లాడుతున్న ఎన్ లతాదేవి

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ, చిన్న తరహా సంస్థల పరిధిలో గల ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న గ్రామోద్యోగ్ వికాస్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేవీఐసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్ లతాదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని గోవిందుపల్లిలో గల వీకేబీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన విలేజ్ ఇండస్ట్రీస్ అక్టివిటీస్ గ్రామోద్యోగ వికాస్ యోజన 2024-25 కార్యక్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ డీజీ ప్రసాద్‌శర్మ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎన్ లతాదేవీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ అంజనాదేవీ పలు అంశాలను వివరించారు.

ఈ సందర్భంగా సీనియర్ ఎగ్జిక్యూటివ్ లతాదేవీ మాట్లాడుతూ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ దేశవ్యాప్తంగా ఉమ్మడి సౌకర్యాలు, సాంకేతిక అధునికీకరణ, శిక్షణ మొదలైన వాటిని అందించడం ద్వారా గ్రామ పరిశ్రమల ప్రోత్సాహం, అభివృద్ధి కోసం గ్రామోద్యోగ్ వికాస్ యోజనను అమలు చేస్తుందన్నారు. 2024-25 సంవత్సరా నికి పథకం కింద అర్హత ఉన్న వ్యక్తులకు అందించడానికి అవసరమైన పనులు చేస్తున్నామన్నారు. ఇందులో శిక్షణ, సాధనాలను అందించడం జరుగుతుంద న్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని అర్హులైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు చేతి వృత్తులకు చెందిన వ్యక్తులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, చిన్న వ్యాపారులు పాల్గొన్నారు.

మూడు జాముల కొదురుపాక



గుట్టల మధ్య ఉన్న కొదురుపాక గ్రామం

- సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో తేడా
- 'గుట్టల' కారణంగానే ప్రత్యేక గుర్తింపు

తెలంగాణలోని పల్లెల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం ఇంచుమించు ఒకే సమయంలో ఉంటాయి. సాధారణంగా ఉదయం ఆరు గంటలకు సూర్యోదయం అయితే, సాయంత్రం ఆరు గంటలకు సాయంత్రం అవుతుంది. కానీ తమ గ్రామంలో మాత్రం ఒక గంట ఆలస్యంగా సూర్యోదయం అవుతుంది. అలాగే మధ్యాహ్నం మూడునాలుగు గంటలకే తమ గ్రామంలో సూర్యాస్తమయం అవుతుందని ఆ ఊరి ప్రజలు చెబుతారు. అదే తమ గ్రామ ప్రత్యేకత అంటూ గర్వంగా చెప్పుకుంటారు.

సుల్తానాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా తెలంగాణలోని పల్లెల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అంటూ నాలుగు జాములను చెబుతారు.. కానీ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో మూడు జాములే ఉంటాయి.



తూర్పున ఉన్న గొల్లగుట్ట



పడమరన ఉన్న రంగనాయకుల గుట్ట

కానీ అందరూ నాలుగో జాము చూసే సమయంలో ఆ గ్రామ ప్రజలు రాత్రిని చూస్తున్నారు. ఇలా ఆ గ్రామ ప్రజలు మూడు జాముల(ఉదయం, మధ్యాహ్నం, రాత్రి)కే పరిమితమవుతున్నారు. ఈ గ్రామం చుట్టూ పెద్దపెద్ద గుట్టలు ఉండడమే ఇందుకు కారణం.. సుమారు 2వేల జనాభాగల కొదురుపాక గ్రామం 'మూడు జాముల కొదురుపాక' గానే ప్రపంచానికి తెలుసు.. అన్ని గ్రామాల్లో కంటే విభిన్నంగా గంట ఆలస్యంగా ఇక్కడి ప్రజలు సూర్యోదయాన్ని చూస్తారు. అంతటా సాయంత్రం ఆరు, ఏడు ప్రాంతంలో చీకట్లు అలుముకుంటే ఈ గ్రామంలో మాత్రం మధ్యాహ్నం మూడు, నాలుగు గంటలకే చీకటి పడుతుంది. పనుల మీద ఎవరైఎక్కడికైనా వెళితే ఠంచనుగా ఇంటికి చేరుకుంటారు. కారణం.. కొదురుపాక గ్రామం చుట్టూ నాలుగు వైపులా ఎత్తయిన గుట్టలు ఉన్నాయి. తూర్పున గొల్ల గుట్ట, పడమరన రంగనాయకుల గుట్ట, దక్షిణాన పాము గుట్ట, ఉత్తరాన నంబులాద్రి గుట్టలు ఉన్నాయి. వీటి మధ్య కొదురుపాక గ్రామం ఉంది. సూర్యుడు ఉదయించే సమయంలో గొల్లగుట్ట అడ్డుగా ఉండడం వల్ల గంట పాటు సూర్యోదయం ఆలస్యంగా అవుతుంది. అలాగే సూర్యుడు అస్తమించే పడమర వైపున రంగనాయకుల గుట్ట అడ్డుగా ఉండటంతో మధ్యాహ్నం మూడునాలుగు గంటలకే గ్రామం చీకటిమయం అవుతుంది. ఇలా మూడు జాములకే పరిమితం అవడం వల్ల ఈ గ్రామానికి 'మూడు జాముల కొదురుపాక'గా గుర్తింపు వచ్చింది.

గంట ఆలస్యంగా సూర్యోదయం..

-చాతరాజు రమేష్, యువకుడు, కొదురుపాక



మా గ్రామానికి తూర్పున ఉన్న గొల్లగుట్ట వల్ల సూర్యోదయం గంట ఆలస్యంగా అవుతుంది. అలాగే పడమర వైపున ఉన్న రంగనాయకుల గుట్టవల్ల సూర్యుడు పడమటి వైపు వెళ్లగానే చీకటి అలుముకుంటుంది. ఇలా మా గ్రామానికి 3 జాములే ఉన్నాయి. అదే మా గ్రామ పేరుకు జతగా నిలిచి మూడుజాముల కొదురుపాకగా పేరుతెచ్చుకుంది. గుట్టల నడుమ గ్రామం ఉండటం వల్ల నాలుగో జామును ఇక్కడి ప్రజలు చూడలేకపోతున్నారు.

మధుర ఫలం.. సీతాఫలం..

- నోరూరిస్తున్న సీతాఫలాలు..
- ఏటా పెద్దఎత్తున విక్రయాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

శీతాకాలం ప్రారంభానికి ముందు వచ్చే సీతాఫలాలు నోరూరిస్తుంటాయి. ప్రకృతిలో సహజ సిద్ధంగా పండే సీతాఫలాలు అంటే ఇష్టపడని వారుండరు. ఎలాంటి ఎరువులు, క్రిమిసంహార మందుల వాడకం లేకుండా పెరిగే సీతా ఫలాలు తినడం వల్ల ఆరోగ్యానికి మేలు. ఎన్నో రకాల విటమిన్లు, పొటాషియం, మెగ్నీషిం కలిగిన సీతాఫలాలను చక్కెర వ్యాధిగ్రస్తులు కూడా తినక మానరు. ఉమ్మడి జిల్లాలోనే సీతాఫలాలకు పెద్దపల్లి పెట్టింది పేరు. ఇక్కడ కొండలు, గుట్టలు పెద్దఎత్తున విస్తరించి ఉండడంతోపాటు పండ్లు అమ్ముకునే వృత్తిని సాగించే ముదిరాజ్ కులస్తులు, ఇతర రైతులు సైతం చేన్లు, చెలకల వద్ద, ఇళ్ల వద్ద సీతా ఫలం చెట్లను పెంచడం వల్ల ప్రతి ఏటా పెద్దఎత్తున పంట వస్తున్నది. సీతా ఫలాలవల్ల ఏటా అనేక మంది ఉపాధి పొందుతున్నారు. పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్దకు ఉదయం కాగానే ధర్మారం, నంది మేడారం, పెద్దపల్లి మండలం కనగర్తి, కాల్వశ్రీరాంపూర్, రామగిరి, పాలకుర్తి మండలా ల్లో విస్తరించి ఉన్న గుట్టల నుంచి సీతాఫలాలు తీసుకుని వచ్చి విక్రయిస్తుంటారు. ఈ ప్రాంతంలో పండే సీతాఫలాలు చాలా పెద్దగా, అత్యంత నాణ్యత కలిగి ఉంటాయి. పెద్దపల్లి పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ముదిరాజ్ కులస్తులు దాదాపు 200 మంది సీజన్ రాగానే సీతాఫలాలు విక్రయిస్తుంటారు. ఏటా సీతాఫలాలు అక్టోబర్ ప్రారంభం నుంచి మార్కెట్ కు వస్తాయి. ఒక్కో కాయ సైజును బట్టి 10 నుంచి మొదలుకుని 30 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఇక్కడికి జిల్లావాసులే గాకుండా కరీంనగర్, మంచిర్యాల, జగిత్యాల, తదితర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తారు.రాజీవ్ రహ దారిలో పెద్దపల్లి ఉండడంతో ఇక్క డి సీతా ఫలాల నాణ్యత గురించి తెలిసి నవాళ్లు జెండా చౌరస్తాకు వచ్చి తప్పకుండా కొనుగోలు చేస్తారు. ఏటా ఒక్కనెల రోజుల్లోనే 20 లక్షలకు పైగా వ్యాపారం సాగుతుంది. ఎక్కువగా మహిళలే విక్రయిస్తుంటారు. నెల రోజుల్లో 10వేల రూపాయలకు తక్కు వ గాకుండా సంపాదించి ఉపాధి పొందుతున్నారు.



పెద్దపల్లి జెండా చౌరస్తాలో విక్రయానికి తీసుక వచ్చిన సీతాఫలాలు



ప్రతి ఏటా రూ.10 వేల వరకు ఆదాయం..

- చీకట్ల సరోజన, పెద్దపల్లి



మా కుటుంబం ఏళ్ల తరబడి సీజన్ రాగానే సీతా ఫలాలు అమ్ముకుని జీవిస్తున్నారు. పదేళ్లుగా నేను సీతా ఫలాలు విక్రయిస్తున్నారు. నెల రోజుల్లో 10 వేల రూపాయల వరకు ఆర్జిస్తాను. ఇక్కడికి జిల్లా నలుమూలల నుంచే గాకుండా కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి వచ్చి సీతా ఫలాలు కొనుగోలు చేస్తారు. ఈ ప్రాంతానికి చెందిన కాయలు చాలా పెద్దగా ఉండడంతో పాటు నాణ్యతగా ఉంటాయి.

సీతాఫలాలు ఇక్కడ బాగా దొరుకుతాయి..

- ఇమ్మడి రాజన్న, పెద్దపల్లి



సీతా ఫలాలకు పెద్దపల్లి పెట్టింది పేరు. ఇక్కడ చాలా పెద్దగా సీతాఫలాలు కాస్తాయి. ఇక్కడి ఫలాల్లో మంచి గుజ్జుతో పాటు తియ్యగా ఉంటాయి. ఎలాంటి రసాయన పదార్థాల వాడకం లేకుండా సహజ సిద్ధంగా సీతా ఫలాలు కాస్తాయి. సీజన్‌లో వీటిని తినడం వల్ల చాలా ఆరోగ్యం. ప్రతి ఏటా కొనుగోలు చేసి తమ కుటుంబ సభ్యులకు, మిత్రులకు అందజేస్తూ ఉంటారు. ఎక్కడెక్కడి నుంచో ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తారు.

జనగామలో బోర్‌వెల్‌ల ఏర్పాటు

కోల్‌సిటీ, అక్టోబరు 22: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ జనగామలో మంగళవారం శ్రీ కామాక్షి అమ్మవారి దేవాలయంలో, రజకుల దోభిఘాట్‌లో సింగరేణి ఆధ్వర్యంలో బోర్‌వెల్‌లు నిర్మించారు. నీటి వసతి లేక భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని, ధోబి ఘాట్‌లో నీటి వసతి లేక నిరుపయోగంగా మారకూడదన్న ఉద్దేశంతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లగా సింగరేణి ఆధ్వర్యంలో బోర్ వెల్ వేయించారు. నీటి అవసరాలు తీర్చేందుకు బోర్లు వేయించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జీఎం లలిత్ కుమార్‌లకు జనగామ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సున్నాల అశోక్, చిప్పకుర్తి మహేష్, కంది మురళి, వీరబోయిన ప్రశాంత్, బద్రి వెంకటేష్, సంజీవ్, నాగరాజు, రాజేందర్, రాజేష్, సత్యం, శ్రీనివాస్, కుమారస్వామి, సింగరేణి సూపర్‌వైజర్ రవి, సుంకరి హరీష్, పొట్ట శరత్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నియామకం

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులుగా చింతల తిరుపతి, ఉపాధ్యక్షులుగా మోతే అంజయ్య, ప్రధాన కార్యదర్శి ఠాకూర్ హనుమాన్ సింగ్‌ను నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. తెలంగాణ ఉద్యమంలో అందించిన సేవలకు గుర్తింపుగా కమిటీలో ప్రాతి నిధ్యం కల్పించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ తెలిపారు.

న్యూస్ బాక్స్

విద్యుత్ ఉద్యోగులతో సమీక్ష

మంథని, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సేఫ్టీ ప్రికాషన్స్, డెవలప్‌మెంట్ వర్క్స్‌పై స్థానిక ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో విద్యుత్ శాఖ ఎస్ఈ సుదర్శనం విద్యుత్ ఉద్యోగులతో మంగళవారం సమీక్షించారు. మంథని సబ్ డివిజన్‌లో విద్యుత్ సరఫరా ఇతర అంశాలపై చర్చించారు. డివిజన్‌లోని డీఈఈ, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ముత్తారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైదబండకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మంగళవారం గ్రామస్థులు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్థులు,విద్యార్థులు బస్సు సౌకర్యం లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నరని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై మంత్రి స్పందించి గోదావరిఖని డీపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బియ్యని శివకుమార్, బూడిది శ్రీనివాస్, రాజబాబు, మహేందర్, రాజేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులను పరిశీలించిన కమిషనర్

సుల్తానాబాద్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో అత్యంత ప్రధానమైన ఐబీ చౌరస్తా రోడ్డును వెడల్పు చేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, కమిషనర్ తోట వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అధికారులు ఐబీ చౌరస్తా నుంచి శాంతినగర్ వరకు ఉన్న రోడ్డు ను పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో పనులు మొదలవుతాయని చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలి

ఓదెల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఈ ఖరీఫ్ సీజన్ లో దాన్య కొనుగోళ్లను మండలంలో సమర్థవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సింగల్ విండో ఛైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి అన్నారు. మండలంలోని పొత్కపల్లిలో మంగళవారం వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనంలో డైరెక్టర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ రెడ్డి మాట్లాడుతూ, సొసైటీ ఆధ్వర్యంలో గత రబీలో 1.82 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని విజయవంతంగా కొనుగోలు చేశామని, ఈసారి కూడా 16 కేంద్రాల్లో రెండు లక్షల క్వింటాల మేరకు ధాన్యాన్ని సమర్థవంతంగా కొనుగోలు చేయాలని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డితో పాటు కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి, సీఈవో గోలి అంజిరెడ్డితో పాటు మండలంలోని డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై కొరడా

కోల్‌సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ నిల్వలు, విక్రయాలపై మున్సిపల్ కార్పొరేషన్ కొరడా ఝుళిపించింది. మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నగరపాలక సంస్థ సిబ్బంది తనిఖీలు జరిపారు. అడ్డగుంటపల్లిలోని లక్ష్మీకిరణంకు రూ.20వేలు, పండ్ల విక్రయాలు, పండ్ల, ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేస్తున్న పండ్ల వ్యా పారికి రూ.15వేలు, మరోవ్యాపారికి రూ.5 వేలు జరిమానా విధించారు. హెల్త్ అసిస్టెం ట్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, శ్రీకాం త్, సిబ్బంది పాల్గొన్నారు.

‘బూడిద’పై అదనపు బాదుడు

(5వ పేజీ తరువాయి)

సీనరేజీ పన్ను చెల్లిస్తున్నది. ఆ బొగ్గుతోనే ఎన్టీపీసీ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది. తద్వారా వెలువడే బూడిదకు ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రైవేట్ అవసరాల కోసం ఎన్టీపీసీ డబ్బులు వసూలు చేస్తున్నది. లారీల యజమానుల నుంచి రెవెన్యూ అధికారులు ట్రిప్పుకు 500 రూపాయలు ఏ నిబంధనల ప్రకారం వసూలు చేస్తున్నారనే విషయం ఎవరికి అంతుచిక్కడం లేదు. కుందనపల్లి, దాని చుట్టూ పక్కల గ్రామాల అభివృద్ధి కోసం అనధికారికంగా వసూలు చేస్తున్నారా, మరే అవసరం కోసం ఏ నిబంధనల ప్రకారం ఈ డబ్బులు వసూలు చేస్తున్నారనే విషయం విమర్శలకు దారి తీస్తున్నది. దీనిపై అధికారులు ఎందుకు గోప్యత ప్రదర్శిస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు అంటున్నారు. ఈ విషయమై అంతర్గాం తహసీల్దార్ ఉయ్యాల రమేష్‌ను ‘ఆంధ్రజ్యోతి’ ఫోన్‌లో సంప్రదించగా కుందనపల్లి యాష్ పాండ్ వద్ద బూడిద లారీల నుంచి డబ్బులు వసూలు చేయడం అంతా కలెక్టర్ కార్యాలయం నుంచే జరుగుతున్నదని, తమకేమి సంబంధం లేదని, పైవాళ్లు చెబితేనే అధికారిక ఖాతాకు జమ చేస్తున్నారు కావచ్చు అని వివరణ ఇచ్చారు. ఒక్కో లారీ ట్రిప్పునకు 500 రూపాయలు ఎందుకు వసూలు చేస్తున్నారో జిల్లా అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని లారీలు, ఇటుక బట్టీల యజమానులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనగర్తి నుంచి హరిపురం వరకు రూ.మూడు కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు మంజూరు పట్ల మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, చొప్పరి రాజయ్య, మచ్చ నర్సింగరావు, బైరి రవి గౌడ్, గోపు నారాయణరెడ్డి, గాజుల శివశంకర్, ఉడిగే సదయ్య, కసిరెడ్డి మహేందర్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ధర్మారం(పెద్దపల్లి రూరల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలని ధర్మారం ఏఎస్ఐ జలీల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో బాలికల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వలన కలిగే లాభనష్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, కానిస్టేబుల్‌లు మధుసూధన్‌రెడ్డి, రజనికాంత్, తిరుపతి పాల్గొన్నారు.

25న దేవునిపల్లి జాతర దుకాణాలకు బహిరంగ వేలం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునిపల్లి శ్రీ లక్ష్మీనృసింహస్వామి జాతరకు పలు దుకాణాలలో సామగ్రి విక్రయించేందుకు ఈ నెల 25న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జాతరలో టెంకాయల విక్రయానికి రూ.50 వేలు, లడ్డూ, పులిహోర, ప్రసాదము రూ.50 వేలు, ప్యాలాలు, పుట్నాలు విక్రయానికి రూ. 10 వేలు దరావత్తు , వేలంలో పాల్గొనే వారు ఈనెల 13 నుండి 24 వరకు షెడ్యూల్ ఫారం రూ.100 చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

సుల్తానాబాద్ లో ఉచిత వైద్య శిబిరం

సుల్తానాబాద్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండలంలోని గర్రెపల్లి ప్రభుత్వ ప్రాదమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో డాక్టర్ సింధూజ తదితరులు సుల్తానాబాద్ పట్టణంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు రక్త బీపీ, షుగర్, రక్త హీనత తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కేంద్రంలో 86 మందికి పరీక్షలు నిర్వహించామని డాక్టర్ అనుదీప్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఆస్పత్రి ఐసీటీసీ సెంటర్ కౌన్సిలర్ శంకర్, సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, కమలాకర్, సరస్వతి, ఎల్‌టీ ఎండీ గౌస్, ఆశాలు, రమాదేవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

5న ఖనిలో దాశరథి, జాషువా సాహిత్య సభకు సన్నాహాలు

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 22: మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాల సందర్భంగా గోదావరిఖనిలో చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య దాశరథి, గుర్రం జాషువాల సాహిత్య సభకు సన్నాహాలు చేస్తున్నది. ఈ మేరకు మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య బాధ్యులు మల్లావఝల విజయానంద్, 32వ డివిజన్ కార్పొరేటర్ అయిత శివకుమార్ మాట్లాడారు. నవంబర్ 5న స్థానిక మార్కండేయకాలనీలోని సిద్ధార్థ హైస్కూల్‌లో సాహిత్య సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు ఎమ్మెల్సీ, గాయకుడు, కవి దేశపతి శ్రీనివాస్, హైదరాబాద్ సిటీ కళాశాల తెలుగు విభాగం డీన్ కోటేశ్వరావులు హాజరవుతున్నారని, దాశరథి సాహిత్యంపై దేశపతి, గుర్రం జాషువా కవిత్వంపై కోటేశ్వరరావు ప్రసంగిస్తారని తెలిపారు. కాగా సాహిత్య సభకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని సాహితీ అభిమానులు, తెలంగాణ వాదులు, సామాజిక వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో హరి, రామకృష్ణ, సంకెరవీందర్, శ్రీహరి, మేకల శ్యామ్, పల్లె ప్రశాంత్, ఆసం కుమార్, పల్లె సతీష్, దుర్గం రవి, పారుపల్లి రాజన్న పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఉద్యోగి సస్పెన్షన్

కోల్‌సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వహరించారనే కారణంగా మున్సిపల్ ఉద్యోగి మంగను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సస్పెండ్ చేశారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు బీఎల్‌ఓ విధులు కేటాయించారు. బీఎల్‌ఓ విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఆమెను సస్పెండ్ చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

ఎలిగేడు, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. మిట్టపల్లి యుగంధర్, సముద్రాల చంద్రమౌళి, జడల సత్యనారాయణ, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

25న చలో హైదరాబాద్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి, పెద్దపల్లి, మహంకాళి సురేష్, బొంకూరి సాగర్, కుక్క అన్వేష్, సుద్దాల సతీష్, సలిగంటి పద్మ, మద్దెల రాజయ్య, బొంకూర్ శంకర్, కలవల కొండయ్య, లక్ష్మి పాల్గొన్నారు

ఘనంగా కొమురం భీం జయంతి వేడుకలు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో మంగళవారం కొమురం భీం జయంతి సందర్బంగా మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తగరం మల్లయ్య, మిట్టపల్లి నారాయణ, తిరుపతిగౌడ్, ఆవునూరి రాజయ్య, న్యాత మధునయ్య, తోటపల్లి రాజేశం, కలవేని సదానందం, ఎనగందుల శ్రీనివాస్, సీపెల్లి సాయి, గజ్జెల శ్రీధర్, శ్రావన్, పిల్లల మర్రి సాకేత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం కొంరంభీమ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండి రాజు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు వేరువేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజలి, మద్దెల సంజీవ్, కట్ల ప్రతాప్, ముంజంపల్లి లచ్చ య్య, న్యాతరి పోచయ్య, కాశిపాక రవి, బోయిన సతీష్, బాసంపల్లి వినోద్, గుల్లె లక్ష్మి, అజయ్, నారాయణ, సంతోష్, స్వా మి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● మంథని (ఆంధ్రజ్యోతి) : గోండు వీరుడు కొమురంభీం జయంతి, మాజీ ఎమ్మెల్సీ గీట్ల జనార్దన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మంగళవారం కొమురంభీం చిత్రపటానికి, గీజారె విగ్రహానికి వారు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, నేతలు తగరం శంకర్ లాల్, మిర్యాల ప్రసాద్‌రావు, కనవేన శ్రీనివాస్, కాయితి సమ్మయ్య, బెల్లకొండ ప్రకాష్‌రెడ్డి, గొబ్బూరి వంశీ, ఆసిఫ్, ఇర్ఫాన్, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డు అందుకున్న సింగరేణి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఎండీ

ఫైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓసీపీ-1 ప్రాజెక్టు ప్రతిష్ఠాత్మక ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధించడంతో యాజమాన్యం అవార్డు అందుకున్నది. సోమవారం రాత్రి న్యూఢిల్లీలోని స్కోప్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో బొగ్గు శాఖా మంత్రి కిషన్‌రెడ్డి, సహాయ మంత్రి సతీష్ చంద్రదుబే చేతుల మీదుగా సీఎండీ బలరాం, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వరరెడ్డి, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణలు అవార్డు అందుకున్నారు. దేశవ్యాప్తంగా కోల్ ఇండియా, సింగరేణితో పాటు ఇతర ప్రైవేట్ సంస్థలకు సంబంధించి 380 గనులు ఫైవ్‌స్టార్ రేటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ప్రమాద రహితంగా ఉన్న అత్యు న్నత గనులను ప్రతి ఏడాది కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఎంపిక చేస్తున్నది. రక్షణను పెంపొందించడం, రక్షణలో పోటీతత్వం పెంపొందించడం కోసం ఈపోటీలను బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్నది. ప్రమాద రహిత గనులను తనిఖీ చేసి మెరుగైన వాటికి ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తున్నది. గత ఏడాది నిర్వహించిన పోటీల్లో సింగరేణికి చెందిన రెండు భూగర్భ గనులు ఫైవ్‌స్టార్ రేటింగ్ దక్కించుకున్నాయి. ఈఏడాది రెండు ఓసీపీలు ఆఘనత సాధించాయి.

ఓసీపీ-1 ఉద్యోగుల పని తీరుకు దక్కిన గౌరవం

ఫైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ప్రాజెక్టు ప్రతిష్ఠాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం ప్రాజెక్టు ఉద్యోగుల పని తీరుకు దక్కిన గౌరవమని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ నాయకుడు గడ్డం తిరుపతి, పిట్ సెక్రెటరీ వెంకటస్వామి ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు సమన్వయం తో ప్రణాళికా బద్ధం పని చేస్తుండడంతో అవార్డు లభించినట్టు వారు తెలిపారు. అవార్డు రావడంపట్ల పీవో రాధాకృష్ణ, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులకు శుభాకాంక్షలు తెలుపుతు న్నట్టు ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులను చెల్లిస్తూ, ఐదు డీఏలను విడుదల చేసి పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలనే డిమాండ్‌తో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం పాఠశాల స్థాయిలో మండలంలోని ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి అంజయ్య, వ్యాల్ల రాజేందర్ రెడ్డి, నూతి మల్లయ్య, గడ్డం దశరథ రెడ్డి,వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులను చెల్లిస్తూ, ఐదు డీఏలను విడుదల చేసి పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తపస్ ఉపాధ్యాయ సంఘ బాధ్యులు ఎలుగం కనుకయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సట్టు పురుషోత్తం, ఉపాధ్యాయులు కుక్క వెంకటస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో రోడ్డు విస్తరణ పనులు పూర్తి : ఎమ్మెల్యే

ఓదెల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న రోడ్డు విస్తరణ, బీటీ రోడ్డు, మురికికాల్వల నిర్మాణం నాలుగు నెలల్లో పూర్తిచేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రోడ్డు విస్తరణ కోసం ఎమ్మెల్యే సమక్షంలో అధికారులు రోడ్డు వెడల్పు కొలతలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు విశాలంగా ఉండేందుకు 40 ఫీట్ల మేరకు అనుమతి తీసుకోవడం జరిగిందని తెలిపారు. గ్రామస్థుల అభిప్రాయం మేరకు గతంలో తీర్మానించినట్లుగానే ప్రస్తుతం 36 ఫీట్ల వరకు రోడ్డు వెడల్పు చేసేందుకు రాజకీయాలకతీతంగా గ్రామస్థులు ముందుకు రావడం శుభ పరిణామమని అన్నారు. మడక నుంచి ఓదెల గ్రామం మీదుగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రం వరకు బీటి రోడ్డు నిర్మాణం పనులు, గ్రామంలో మురికి కాల్వల నిర్మాణం, నాలుగు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ముందుగా నాలుగు రోజుల్లో రోడ్డు వైడింగ్ (కూల్చివేతలు) పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, చీకట్ల మొండయ్య, బోడకుంట స్వామి, ఆకుల మహేందర్, బోడకుంట శంకర్, గోపు నారాయణరెడ్డి, చింతం కుమారస్వామి, గొర్ల శ్రీనివాస్, వంగ రాజమల్లు, సిరిసేటి రాహుల్, పడాల రాజు, పచ్చిమట్ల శ్రీనివాస్, రెడ్డి రజనీకాంత్, అంబాల కొమురయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ట్రినిటీ కళాశాలలో ఎన్‌సీసీ సబ్ యూనిట్ ప్రారంభం


కమాండ్ ఆఫీసర్‌లను ఆహ్వానిస్తున్న మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ట్రినిటీ డిగ్రీ పీజీ కాలేజీలో ఎన్‌సీసీ సబ్ యూనిట్ ను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్నల్ డేనియల్ లోట్స్, కమాండింగ్ ఆఫీసర్ 9(టి) కరీంనగర్ సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ హాజరయ్యారు. ఫౌండర్ ఆఫ్ ట్రినిటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ దాసరి మనోహర్‌రెడ్డి వీరిని ఆహ్వానించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోని యువత క్రమశిక్షణగల పౌరులుగా అభివృద్ధి చేయడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఆసక్తిగల విద్యార్థులను ఎంపిక చేసి క్యాడెట్‌గా తీసుకుంటారని సీవో డేనియల్ లోట్స్ తెలిపారు. ఈ క్యాడెట్స్‌కు చిన్న ఆయుధాలు, డ్రిల్‌లో ప్రాథమిక శిక్షణ ఇవ్వబడుతుందని శిక్షణ అనంతరం క్రియాశీల సైనిక సేవకు ఎంపిక కావచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ సీతారెడ్డి, సతీష్, వేంకటేష్, కేర్ టేకర్, క్యాడెట్స్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాపై ఫిర్యాదు

రామగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓబీ మట్టి అక్రమ రవాణాపై సింగరేణి ఏస్టేట్ అధికారి ఐలయ్య, సెక్యూరిటీ అధికారి షబ్బీరోద్దిన్‌లకు ఫిర్యాదు చేసినట్లు మంగళవారం రామగిరి ట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాడెం లింగయ్య తెలిపారు. సింగరేణి ఎన్విరాన్‌మెంట్ అధికారి నాగేశ్వర్‌రావు, జేసీబీ ఓనర్ శ్రీనివాస్‌తో కుమ్మక్కై ఓబీ మట్టిని అమ్ముకుంటున్నట్లు తెలిపానని పేర్కొన్నారు. లద్నాపూర్ గ్రామస్తులకు కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు, భూనిర్వాసితులకు మాత్రమే ఓబీ మట్టిని ఇవ్వాలని కోరారు.

గ్రామాల్లో సురక్షిత నీటిని అందించాలి

రామగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సురక్షితమైన నీటిని గ్రామస్థులకు అందించాలని ఎంపీడీవో శైలజారాణి అన్నారు. మంగళవారం మండల పరిషత్ భవనంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సురక్షితమైన నీటిని ప్రజలకు సరఫరా చేయాలని సూచనలు చేశారు. మిషన్ భగీరథ నీరు గ్రామానికి సరిపడని పక్షంలో గ్రామపంచాయతీ నీటి వనరులను వాడాలని, సంబంధిత అధికారుల పరిశీలన అనంతరమే సరఫరా చేపట్టాలని సూచించారు. ప్రతి రోజు క్లోరినేషన్ చేపట్టాల పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ శృతి, ఎంపీవో ఉమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన

రామగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీలోని వాణి పాఠశాలలో షీటీంపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మల్లన్న అధ్యక్షతన కమీషనరేట్ షీటిం సభ్యురాలు స్నేహలత విద్యార్థులకు షీటీం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్, షీటిం సిబ్బంది పాల్గోన్నారు.

ప్రజా, రైతుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

జూలపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా, రైతుల సంక్షేమాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 60మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరుణ, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ గందు సంజీవ్, విండోఛైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మీ నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, మానుమండ్ల శ్రీనివాస్, జెట్టి సతీష్, కనకట్ల నర్సింగం, అమరగాని లింగయ్యగౌడ్ తదితరులు పాల్గోన్నారు.

దేశీదారు బాటిళ్ల పట్టివేత

అంతర్గాం, అక్టోబరు 22: రామగుండం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదుట మహారాష్ట్ర నుంచి దేశీదారు బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్రలోని సిరువంచకు చెందిన ఏర్కిచేతల రాజమల్లు రైలులో దేశీదారు బాటిళ్లను రామగుండం తీసుకువచ్చి సమీప గ్రామాల్లో విక్రయిస్తుంటాడు. రైల్వే స్టేషన్ ఎదుట తిరుగుతున్న నిందితున్ని అదుపులోకి తీసుకుని అతని వద్దగల బ్యాగును తనిఖీ చేయగా 200దేశీదారు బాటిల్స్ దొరికాయని, తదుపరి విచారణ నిమిత్తం నిందితున్ని, బాటిళ్లను రామగుండం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ పేర్కొన్నారు. రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంపత్, హఫీజ్, రాజేందర్‌లు పాల్గొన్నారు.